నిస్సారమైన జీవితం!

- థైరాయిడ్‌తో సమస్యలు అధికం
- మందులు, వ్యాయామంతో నియంత్రణ
- జిల్లాలో 20 శాతం మంది ఈ వ్యాధి బాధితులు
- నేడు వరల్డ్ థైరాయిడ్ డే



కర్నూలు(హాస్పిటల్): గొంతు వద్ద ఉండే థైరాయిడ్ చూడటానికి చిన్నగానే ఉన్నా మొత్తం శరీరాన్నే ప్రభావితం చేస్తుంది. ఈ గ్రంథి సరిగ్గా పనిచేయక పోతే వివిధ అవయవాల పనితీరులోనూ తేడాలు కనిపిస్తాయి. ఫలితంగా శరీరం అస్తవ్యస్తమైన సమస్యలతో నిస్సారంగా తయారవుతుంది. ఇటీవల ఈ వ్యాధి బాధితుల సంఖ్య పెరుగుతూ వస్తోంది. ఈ నెల 25వ తేదీన ×వరల్డ్ థైరాయిడ్ డే¤ సందర్భంగా ప్రత్యేక కథనం.

కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని ఎండోక్రైనాలజీ విభాగానికి ప్రతి వారం రెండురోజుల పాటు ఓపీ సేవలు ఉంటాయి. ఇందులో షుగర్, థైరాయిడ్, ఇతర హార్మోన్ సమస్యలతో వారానికి 800 మంది రోగులు చికిత్స కోసం వస్తారు. వారిలో కేవలం థైరాయిడ్ జబ్బుతో బాధపడే రోగులు 200 మంది దాకా ఉంటున్నారు. ఈ మేరకు ఒక నెలకు 800 మంది థైరాయిడ్ రోగులు చికిత్స కోసం వస్తున్నారు. ఇందులో 500 మంది కొత్త రోగులు వస్తున్నట్లు వైద్యులు చెబుతున్నారు. ప్రైవేటు వైద్యుల వద్దకు సైతం ప్రతిరోజూ 80 మందికి పైగా థైరాయిడ్ బాధితులు చికిత్స కోసం వస్తున్నారు. ఈ మేరకు వారి వద్దకు సగటున నెలకు 2 వేల మంది చికిత్స పొందుతున్నారు. మొత్తం థైరాయిడ్ రోగుల్లో 70 శాతం మంది హైపో థైరాయిడ్, 30 శాతం మంది హైపర్‌థైరాయిడ్ బాధితులు ఉంటున్నారు. పిల్లల నుంచి పెద్దల వరకు ఈ సమస్య ఇప్పుడు బాధిస్తోంది. స్త్రీలలో 20 శాతం, పురుషులలో 15 మంది ఈ వ్యాధికి గురవుతున్నారు. వీరిలో కొందరికి గాయిటర్(గొంతు వద్ద గడ్డ) ఉంటోంది. ఇలా కణితి ఉన్న వారికి ఆపరేషన్ అవసరం లేదు. క్యాన్సర్‌గా మారితేనే ఆపరేషన్ చేయించుకోవాలి. గడ్డలు ఏర్పడ్డ వారిలో 5 శాతం మందిలో మాత్రమే క్యాన్సర్ కణితిలు ఉంటాయి. వీరికి మాత్రమే ఆపరేషన్ చేసి కణితి తొలగించాల్సి ఉంటుంది.

హార్మోన్ల అసమతుల్యతలతో థైరాయిడ్

పాలిపెప్టైడ్‌తో నిర్మితమైన రసాయన వాహకాలు హార్మోన్లు. ఇవి శరీరంలో ఒక ప్రాంత కణజాలం, అవయవాల నుంచి ఉత్పత్తి అయి వివిధ శరీర భాగాలకు రక్తం ద్వారా ప్రవహించి నిర్దిష్ట అవయవాన్ని ప్రభావితం చేసి జీవక్రియల సమతుల్యతకు తోడ్పడతాయి. ఈ హార్మోన్లు ఎండోక్రైన్, ఎక్సోక్రైన్ గ్రంథుల నుంచి ఉత్పత్తి అవుతాయి. ఇవి మానవ శరీరంలోని వివిధ సాధారణ జీవన క్రియలైన శ్వాసక్రియ, జీర్ణక్రియ, శారీరక, మానసిక ఎదుగుదల, ప్రత్యుత్పత్తి, మానసిక సమతుల్యత మొదలైన జీవక్రియలకు తోడ్పడతాయి. మానవునిలో ఈ హార్మోన్లు అసమతుల్యతకు గురైనప్పుడు తీవ్రమైన దీర్ఘకాలిక వ్యాధుల భారిన పడతారు. ఇటీవల కాలంలో హార్మోన్ సమస్యలతో బాధపడే వారి సంఖ్య అధికమైంది. డయాబెటీస్(షుగర్), థైరాయిడ్, పీసీఓడీ వంటి జబ్బులు హార్మోన్ సమస్యల కిందకు వస్తాయి. ఇందులో షుగర్ తర్వాత ఇటీవల కాలంలో అధికంగా వినిపించేది థైరాయిడ్ జబ్బేనని వైద్యులు చెబుతున్నారు. థైరాయిడ్ గ్రంథి నుంచి టీ3, టీ4 హార్మోన్లు ఉత్పత్తి అవుతాయి. వీటి ప్రభావం మానవుని జీవనక్రియలపై 90 శాతం ఉంటుంది. ఇవి అసమతుల్యతకు గురైతే హైపోథైరాయిడ్, హైపర్ థైరాయిడ్ అనే దీర్ఘకాలిక జబ్బులు వస్తాయి.

హైపో థైరాయిడ్ లక్షణాలు

థైరాయిడ్ హార్మోన్ తక్కువగా ఉత్పత్తి అవుతుంది. ఈ కారణంగా బరువు పెరగడం, జుట్టు రాలడం, నీరసం, మతిమరుపు, ఆడవారిలో రుతుక్రమం సక్రమంగా లేకపోవడం, చలిని తట్టుకోలేకపోవడం, మలబద్దకం, అజీర్తి, హృదయ స్పందనరేటు తగ్గడం, నిరాశ, చర్మం పొడిగా మారడం, ఏకాగ్రత తగ్గిపోవడం, శ్వాస సరిగ్గా ఆడకపోవడం, మొరటు గొంతు, వినికిడి తగ్గడం వంటి లక్షణాలు ఉంటాయి.

హైపర్ థైరాయిడ్ లక్షణాలు

ఇందులో థైరాయిడ్ హార్మోన్ అధికంగా స్రవిస్తుంది. గొంతు వద్ద వాపు కనిపిస్తుంది. బరువు తగ్గుతారు. గుండె వేగంగా కొట్టుకుంటుంది. అధికంగా చెమటపట్టడం, జుట్టురాలడం, నీరసం, కాళ్లు చేతులు వణకడం, కళ్లు పెద్దగా కనిపించడం వంటి లక్షణాలు ఉంటాయి.

అయోడిన్ ఉప్పు వాడాలి



అయోడిన్ ఉప్పు సరిగ్గా వాడకపోతే థైరాయిడ్ జబ్బు వస్తుంది. ఇప్పటికీ గ్రామాల్లో రాళ్ల ఉప్పు వాడుతున్నారు. అయోడైజ్‌డ్ కలిపిన ఉప్పునే కొని వాడాలి. అది కూడా ఉప్పు ఉన్న డబ్బాను ఎప్పుడూ మూసి ఉంచాలి. లేకపోతే అయోడిన్ గాలిలో కలిసి పోతుంది. థైరాయిడ్ ఉన్న వారు క్యాబేజీ, కాలిఫ్లవర్‌కు దూరంగా ఉండాలి. వైద్యులు చెప్పిన ప్రకారం మందులు వాడుతూ ఉంటే ఏమీ కాదు. హైపోథైరాయిడ్ వారు పరీక్షల్లో నార్మల్‌గా వస్తే మళ్లీ ఆరు నెలలకు ఒకసారి మాత్రమే పరీక్ష చేయించుకోవాలి. హైపర్ థైరాయిడ్ వారు మూడు నెలలకు ఒకసారి పరీక్ష చేయించుకోవాలి. కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో థైరాయిడ్ పరీక్ష ఉచితంగా నిర్వహిస్తున్నాము. ఈ వ్యాధికి అయ్యే మందుల ఖరీదు కూడా చాలా తక్కువ.

–డాక్టర్ పి. శ్రీనివాసులు, ఎండోక్రైనాలజీ విభాగాధిపతి, జీజీహెచ్, కర్నూలు

గర్భిణులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి



గర్భం దాల్చిన మహిళలు తప్పనిసరిగా థైరాయిడ్ పరీక్ష చేయించుకోవాలి. పరీక్షలో థైరాయిడ్ నిర్ధారణ అయితే వైద్యుల సూచన మేరకు మందులు వాడాలి. ఆరు వారాల తర్వాత తిరిగి పరీక్ష చేయించి సమీక్షించుకోవాలి. అనంతరం ప్రతి మూడు నెలలకు ఒకసారి పరీక్ష చేయాలి. ప్రసవం తర్వాత కూడా పరీక్ష చేయించుకుని మందులు వాడాలి. గర్భిణులకు ఇది వరకే థైరాయిడ్ ఉండి మందులు వాడకపోతే పుట్టబోయే బిడ్డకు ఈ జబ్బు వస్తుంది. ప్రసవం అయిన వెంటనే బిడ్డకు కూడా థైరాయిడ్ పరీక్ష చేయించడం మంచిది. పిల్లలకు థైరాయిడ్ ఉన్నా మందులు వాడకపోతే వారికి బుద్ధిమాంద్యం వస్తుంది.

–డాక్టర్ టి. జ్యోత్స్న, గైనకాలజిస్టు, కర్నూలు

క్లుప్తంగా

హజ్ యాత్రికులకు వ్యాక్సినేషన్



హజ్ యాత్రికునికి వ్యాక్సిన్ చుక్కలు వేస్తున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ బి. రామగిడ్డయ్య

కర్నూలు(హాస్పిటల్): హజ్‌కు వెళ్లే యాత్రికులకు అవసరమైన వ్యాక్సినేషన్లు వేసేందుకు బుధవారం పెద్దమార్కెట్ వద్ద ఉన్న రాయల్ ఫంక్షన్ హాలులో ప్రత్యేక శిబిరాన్ని ఏర్పాటు చేశారు. శిబిరాన్ని డీఎంహెచ్‌ఓ డాక్టర్ బి. రామగిడ్డయ్య ప్రారంభించి ప్రసంగించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఈ కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. హజ్‌కు వెళ్లేందుకు 280 మంది నమోదు చేసుకున్నారని, వీరందరికీ ఓరల్ పోలియో వ్యాక్సిన్, మేనిన్గోకోకల్, ఇన్‌ఫ్లుయింజా వ్యాక్సిన్‌లు వేశారన్నారు. వీరికి అవసరమైన టీకాలు వేసి సర్టిఫికెట్ అందిస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ వై. ప్రవీణ్‌కుమార్, డాక్టర్ హకీమ్, డాక్టర్ మాధవి, డాక్టర్ అపర్ణ, డాక్టర్ మౌనిక, డాక్టర్ శహిస్తఫాతిమా, డాక్టర్ శ్రీరామ్, డాక్టర్ మున్వర్, డాక్టర్ మొయిన్, డెమో శ్రీనివాసులు, డిప్యూటీ డెమో చంద్రశేఖర్‌రెడ్డి, ప్రాజెక్షనిస్టు ఖలీల్ పాల్గొన్నారు.

వృద్ధాప్యం మరో పసితనం లాంటిది



వృద్ధులకు నిత్యావసరాలు పంపిణీ చేస్తున్న డాక్టర్ బి. శంకరశర్మ

కర్నూలు(హాస్పిటల్): వృద్ధాప్యం మరో పసితనం లాంటిదని, వారి బాగోగులు చూడాల్సిన బాధ్యత నేటితరంపై ఉందని గ్యాస్ట్రో ఎంట్రాలజిస్ట్ డాక్టర్ బి. శంకరశర్మ చెప్పారు. బుధవారం ఆయన కర్నూలు మండలం దిన్నెదేవరపాడు గ్రామంలోని వృద్ధాశ్రమంలో వృద్ధులకు నిత్యావసర సరుకులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆత్మీయుల కోసం ఎంతగానో ఎదురుచూసే మనసు వృద్ధులకు ఉంటుందన్నారు. ప్రేమ, ఆప్యాయతలు దూరం కావడం, గృహ సంబంధమైన వివాదాలు, ఉద్యోగాల పేరిట పిల్లలు దూరంగా ఉండటం వంటి కారణాల వల్ల వృద్ధులు ఆశ్రమాల్లో ఉండాల్సి వస్తోందన్నారు. జీవిత అనుభవం తెలుసుకోవాలంటే నేటి యువతరం వృద్ధులతో గడపాలన్నారు.

జైన్ ఆలయం సందర్శించిన ఐఏఎస్ ర్యాంకర్



జైన్ ఆలయంలో అంబికా జైన్

కర్నూలు(సెంట్రల్): ఐఏఎస్‌కు ఎంపికైన ఎమ్మిగనూరు చెందిన జైన్ ఎలక్ట్రానిక్స్ యజమాని లలిత్‌జైన్ కుమార్తె అంబికా జైన్ బుధవారం కర్నూలులోని జైన్ ఆలయాన్ని సందర్శించింది. హైదరాబాద్ రూట్‌లో ఉన్న ఆలయాన్ని ఆమె సందర్శించి మొక్కులు తీర్చుకుంది. మారుమూల ప్రాంతమైన ఎమ్మిగనూరుకు చెందిన ఆమె ఐఏఎస్ ర్యాంకు సాధించడంతో పలువురు అభినందించారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

కర్నూలు(సెంట్రల్): ప్రతి ఒక్కరూ తమ చుట్టు ఉన్న పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కాలుష్య నియంత్రణ మండలి డిప్యూటీ జోనల్ మేనేజర్ కృష్ణమోహన్‌రావు పేర్కొన్నారు. బుధవారం మిషన్ లైఫ్ కార్యక్రమంలో కల్లూరు పారిశ్రామిక వాడలో పీసీబీ, మునిసిపల్, ఏపీఐఐసీ ఆధ్వర్యంలో పరిసరాల పరిశుభ్రత కార్యక్రమం చేపట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణ కోసం పాటుపడాలన్నారు. కాలంచెల్లిన వాహనాలను వినియోగించరాదన్నారు. కార్యక్రమంలో పీసీబీ ఈఈ మునిప్రసాదు పాల్గొన్నారు.

పుస్తక పఠనాన్ని అలవర్చుకోండి



విద్యార్థులకు వివిధ అంశాలపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

కర్నూలు(సెంట్రల్) : విద్యార్థులు పుస్తక పఠనాన్ని అలవాటు చేసుకోవాలని రిటైర్డ్ లెక్చరర్ హుస్సేన్ పీరా సూచించారు. బుధవారం జిల్లా గ్రంథాలయ సంస్థలో జరుగుతున్న వేసవి విజ్ఞాన శిబిరానికి ఆయన అతిథిగా హాజరై విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. పుస్తక పఠనం ప్రాధాన్యతను వివరించారు. పుస్తక పఠనంతో జ్ఞాపక శక్తి పెరుగుతుందని, మనసు నిబ్బరంగా ఉంటుందని చెప్పారు. అనంతరం విద్యార్థులకు సామెతలు, కవితలు, హాస్యాలను బోధించారు. కార్యక్రమంలో అటవీ శాఖకు చెందిన రేణుక, అబ్దుల్‌కలాం, కాశీదాసు, లక్ష్మీదేవిబాయి, జనవిజ్ఞాన వేదిక సభ్యులు యాగంటీశ్వరప్ప పాల్గొన్నారు.

నాట్ విల్లింగ్ సరికాదు

కర్నూలు సిటీ: ఉపాధ్యాయుల పదోన్నతులకు కౌన్సెలింగ్ నిర్వహించకుండా నాట్ విల్లింగ్ ఇవ్వమని కోరడం సరైంది కాదని, పదోన్నతులు, బదిలీలలో అసంబద్ధమైన వాటిని తొలగించాలని ఏపీటీఎఫ్ నాయకులు డీఈఓ రంగారెడ్డిని కోరారు. బుధవారం వారు డీఈఓను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం నాయకులు మాట్లాడుతూ పదోన్నతి వస్తుందో రాదో తెలియని ఉపాధ్యాయులు ముందుగానే నాట్ విల్లింగ్ ఇవ్వడం ద్వారా చేజేతులా తన పదోన్నతిని తానే కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. పదోన్నతులు ప్రత్యక్ష కౌన్సిలింగ్ ద్వారా నిర్వహించాలని కోరారు. డీఈఓను కలిసిన వారిలో ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి రవికుమార్, ఉమ్మడి జిల్లా ప్రధాన కార్యదర్శి శివయ్య తదితరులు ఉన్నారు.

గ్రామ కంఠం రీ సర్వేను వేగవంతం చేయండి



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న అధికారులు

కర్నూలు(అర్బన్): గ్రామాల్లోని నివాసాలు, ప్రభుత్వ భవనాలు, గ్రామ కంఠం స్థలాలకు రక్షణ కల్పించేందుకు నిర్వహిస్తున్న రీ సర్వేను వేగవంతం చేయాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి కమిషనర్ సూర్యకుమారి ఆదేశించారు. బుధవారం ఆమె విజయవాడలోని తమ కార్యాలయం నుంచి జిల్లా అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. స్థానిక జిల్లా పరిషత్‌లో నిర్వహించిన ఈ సమావేశానికి జెడ్పీ సీఈఓ జి. నాసరరెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి టి. నాగరాజునాయుడు, డ్వామా పీడీ అమర్‌నాథ్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామకంఠం రీసర్వేకు సంబంధించిన కార్యక్రమాల్లో ఎంపీడీఓలు కూడా పాల్గొనేలా సీఈఓలు చర్యలు చేపట్టాలన్నారు. అలాగే జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనుల్లో కూడా సీఈఓలు తమ పాత్ర పోషించాలన్నారు. ముఖ్యంగా ఉపాధి హామీ పథకం పనుల గుర్తింపు, నాణ్యత, జాబ్ కార్డ్స్ మంజూరు, కూలీల సంఖ్య పెంపునకు చర్యలు చేపట్టాలన్నారు. గ్రామీణ సంసద్ యోజన కార్యక్రమాన్ని అమలు చేయడంలో భాగంగా జిల్లా కలెక్టర్ ద్వారా స్థానిక పార్లమెంటు సభ్యులతో కలసి సమావేశాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. అలాగే కోర్టు కేసులు పెండింగ్ లేకుండా చూసుకోవాలని ఆదేశించారు.

రసాయనాలతో కలిగే నష్టాలు తగ్గించండి

- కర్నూలు ఎంపీ డాక్టర్ సంజీవ్‌కుమార్



సమావేశంలో పాల్గొన్న కర్నూలు ఎంపీ డాక్టర్ సంజీవ్‌కుమార్

కర్నూలు(రాజ్‌విహార్):రసాయనాల వల్ల కలిగే నష్టాలను తగ్గించాలని కర్నూలు ఎంపీ డాక్టర్ సంజీవ్‌కుమార్ కోరారు. బుధవారం కేరళ రాష్ట్రంలోని కొచ్చిలో జరిగిన స్టడీ టూర్ ఆఫ్ స్టాండింగ్ కమిటీ ఆఫ్ కెమికల్స్ అండ్ ఫర్టిలైజర్స్ సమావేశంలో ఆయన పాల్గొన్నారు. రసాయనాలు రైతులకు హాని చేసేవి కాకుండా మేలు చేలా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో పలు రాష్ట్రాల ఎంపీలు పాల్గొన్నారు.

అందుబాటులో ఉండండి

కర్నూలు(రాజ్‌విహార్): విద్యుత్ వినియోగదారులకు అందుబాటులో ఉండాలని దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ కర్నూలు ఆపరేషన్స్ ఎస్‌ఈ ఎం. ఉమాపతి సిబ్బందికి ఆదేశించారు. బుధవారం ఆయన కింది స్థాయి సిబ్బందితో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాలు, గాలి వల్ల ఏర్పడే అంతరాయంపై అప్రమత్తంగా ఉండాలని, ఏవైనా సమస్యలు ఏర్పడి వినియోగదారులు ఫిర్యాదు చేస్తే వెంటనే స్పందించి పరిష్కారం చూపాలని ఆదేశించారు.

విధుల్లోకి తీసుకోవాలి



వీసీ ఆనందరావుకు వినతిపత్రం అందజేస్తున్న నాన్ టీచింగ్ టైం స్కేల్ ఉద్యోగుల సంఘం నాయకులు

కర్నూలు (న్యూసిటీ) : సస్పెండ్‌కు గురైన రాయలసీమ యూనివర్సిటీ నాన్ టీచింగ్ టైం స్కేల్ ఉద్యోగులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని వైస్ చాన్స్‌లర్ ఆచార్య ఎ.ఆనందరావుకు ఆ సంఘం నాయకులు కోరారు. బుధవారం వారు వీసీని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాన్ టీచింగ్ టైం స్కేల్ ఉద్యోగుల అధ్యక్షుడు పి.సుంకన్న మాట్లాడుతూ సస్పెండ్ అయిన వారు దాదాపు 15–23 ఏళ్ల నుంచి పని చేస్తున్నారన్నారు. వారు చేస్తున్న ఉద్యోగాలు రెగ్యులర్ కాదని, ఫేక్ సర్టిఫికెట్ పెట్టి ఎలాంటి పదోన్నతులు పొందలేదని పి.సుంకన్న విన్నవించారు. మానవత దృక్పథంతో వారిని తిరిగి విధుల్లోకి తీసుకోవాలని కోరారు.



కళాకారులను సన్మానిస్తున్న దృశ్యం

కళాకారులకు సత్కారం

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు జిల్లా రంగస్థలం కళాకారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పలువురు కళాకారులను ఘనంగా సన్మానించారు. బుధవారం సాయంత్రం పింగళి సూరన తెలుగుతోటలో పౌరాణిక నాటకాలు ప్రదర్శించారు. ముఖ్యఅతిథిగా హాజరైన రవీంద్ర విద్యాసంస్థల అధినేత పుల్లయ్య, కేవీ సుబ్బారెడ్డి విద్యాసంస్థల అధినేత కేవీ సుబ్బారెడ్డి చేతుల మీదుగా నలుగురు పేదకళాకారులకు ఆర్థిక సహాయం అందించారు. అనంతరం 8 మంది కళాకారులకు, ఇద్దరు హార్మోనిస్టులకు, ఒక తబలిస్ట్, ఒక మేకప్‌మ్యాన్, మహిళా కళాకారులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు రాజేశ్వరరెడ్డి, లతీఫ్, లలిత కళాసమితి అధ్యక్షుడు పత్తిఓబులయ్య, సంఘం జనరల్ సెక్రటరీ పి. హనుమంతరావు చౌదరి తదితరులు పాల్గొన్నారు.

నేటితో ముగియనున్న పరీక్ష ఫీజు గడువు

కర్నూలు సిటీ: ఓపెన్ స్కూల్ ద్వారా టెన్త్, ఇంటర్మీడియెట్ సప్లిమెంటరీ పరీక్షల ఫీజుల చెల్లింపు గడువు నేటి(గురువారం)తో ముగియనుంది. ఒక సబ్జెకుకు రూ.25 ప్రకారం అపరాధ రుసుంతో ఈ నెల 26 నుంచి 29వ తేది వరకు, రూ.50 తో 30, 31 తేదిల్లో పరీక్ష ఫీజులు చెల్లించవచ్చు. పదో తరగతిలో ఒక సబ్జెక్టుకు రిజిస్ట్రేషన్ ఫీజు రూ.5, పరీక్ష ఫీజు రూ.95 మొత్తం రూ.100 ప్రకారం, ఇంటర్మీడియేట్ ఒక సబ్జెక్టుకు థీయరికి రిజిస్ట్రేషన్‌కు రూ.5, పరీక్ష ఫీజు రూ.145 మొత్తం రూ.150, ప్రాక్టికల్ పరీక్షలకు రూ.100 ప్రకారం ఫీజులు చెల్లించాలి. ఫెయిల్ అయిన ఇంటర్మీడియెట్ విద్యార్థులు పాసైన సబ్జెక్టులలో మార్కులను పెంచుకునేందుకు(ఐదు సంవత్సరాలలో కేవలం ఒకసారి మాత్రమే వినియోగించుకునే అవకాశం ఉంటుంది) థీయరి ఒక సబ్జెక్టుకు రూ.250, ప్రాక్టికల్‌లో ఒక సబ్జెక్టుకు రూ.100 ప్రకారం చెల్లించాలి. పరీక్షల ఫీజులు ఏపీ ఆన్‌లైన్/మీ సేవ కేంద్రాల ద్వారా చెల్లించాలి.

స్పోర్ట్స్

రాష్ట్రస్థాయి పవర్ లిఫ్టింగ్‌లో కర్నూలుకు పతకాలు



పతకాలు సాధించిన వారిని అభినందిస్తున్న అసోసియేషన్ నాయకులు

కర్నూలు (రూరల్): ఈనెల 21 నుంచి 25 వరకు గుంటూరు జిల్లా తెనాలిలో నిర్వహించిన 10వ రాష్ట్రస్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలో జిల్లా పవర్ లిఫ్టింగ్ క్రీడాకారులు పతకాలు సాధించారు. వీరిని అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్ బుధవారం అభినందించారు. సబ్ జూనియర్ విభాగంలో శివాజి (57 కేజీలు, మూడవ స్థానం), మహేంద్ర (56 కేజీలు, మూడవ స్థానం), విజయ్ కుమార్ (74 కేజీలు, మొదటి స్థానం), రాజు (83 కేజీలు, మొదటి స్థానం), రోహిత్ శర్మ (93 కేజీలు, రెండవ స్థానం), అలాగే జూనియర్స్ విభాగంలో లక్ష్మీనరసింహ (53 కేజీలు, మొదటి స్థానం), మహేశ్వరరావు (83 కేజీలు, రెండవ స్థానం), జూనియర్ బాలికల విభాగంలో పల్లవి (43 కేజీలు, మొదటి స్థానం) పతకాలు సాధించారు. రాష్ట్రస్థాయిలో పతకాలు సాధించి జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించడం జిల్లాకు గర్వకారణమని అసోసియేషన్ నాయకులు తెలిపారు. కార్యక్రమంలో గోపాల్, సీనియర్ క్రీడాకారిణి రేష్మ పాల్గొన్నారు.

క్రీడాదుస్తులు పంపిణీ



క్రీడాకారులను అభినందిస్తున్న దాత వెంకటరామిరెడ్డి

కర్నూలు (రూరల్): వేసవి శిక్షణ శిబిరంలో పాల్గొంటున్న 40 మంది క్రీడాకారులకు దుస్తులు పంపిణీ చేశారు. బుధవారం నగరంలోని బి.క్యాంప్ క్రీడా మైదానంలో దాత సీనియర్ క్రీడాకారుడు వెంకటరామిరెడ్డి చేతుల మీదుగా వాటిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల ద్వారా శారీరక, మానసిక ఒత్తిడిని జయించవచ్చన్నారు. ఒలింపిక్ సీఈఓ విజయ్‌కుమార్ మాట్లాడుతూ క్రీడాకారులు నిత్య సాధన ద్వారా నైపుణ్యం మెరుగుపరుచుకోవాలన్నారు. కార్యక్రమంలో పెద్దపాడు స్కూల్ హెచ్‌ఎం వేణుగోపాల్, రంగడు, సీనియర్ క్రీడాకారులు విజయ్, రాజేశ్వర్, నరసింహులు, కుమార్ పాల్గొన్నారు.

పండ్ల తోటల సాగును ప్రోత్సహించాలి

- డ్వామా పీడీ అమర్‌నాథ్‌రెడ్డి



పండ్ల తోటలను పరిశీలిస్తున్న డ్వామా పీడీ

ఓర్వకల్లు: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా పండ్ల తోటలను సాగును ప్రోత్సహించాలని డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ అమర్‌నాథ్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని పూడిచెర్ల గ్రామ సచివాలయాన్ని సందర్శించారు. సచివాలయంలో సిబ్బంది పనితీరుపై ఆరా తీశారు. అనంతరం పండ్ల తోటల పెంపకాన్ని పరిశీలించి రైతుల అభిప్రాయాలు తెలుసుకున్నారు. పూడిచెర్ల, ఓర్వకల్లు గామాల వద్ద జరుగుతున్న ఉపాధి హామీ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ.. ఉపాధి హామీ సిబ్బంది నిర్దేశించిన లక్ష్యాల మేరకు కూలీలకు పనులను కల్పించాలన్నారు. కార్యక్రమంలో సీఎల్ఆర్‌సీ కోర్సు డైరెక్టర్ నాగ ఎర్రమల, ఏపీఓ కుమార్‌సాయినాథ్, ఈసీ మధుకృష్ణ, సాంకేతిక, క్షేత్రస్థాయి సహాయకులు పాల్గొన్నారు.

బాల్యవివాహం అడ్డగింత

ఆదోని రూరల్: మండలంలోని జాలిమంచి గ్రామంలో బాల్యవివాహాన్ని అధికారులు అడ్డుకున్నారు. జాలిమంచి గ్రామానికి చెందిన బాలికను ఎమ్మిగనూరు మండలం నాగలాపురం గ్రామానికి చెందిన ఇజ్రాయిల్, సువార్తమ్మ దంపతుల కుమారుడు దేవదాసంకు ఇచ్చి వివాహం జరిపించేందుకు నిశ్చితార్థం జరిపారు. అయితే గురువారం ఉదయం వివాహం జరిపించాల్సి ఉండటంతో బుధవారం సాయంత్రం నాగలాపురం వెళ్తుండగా కొందరు గ్రామస్తులు ఉన్నతాధికారులకు సమాచారం చేరవేశారు. దీంతో తహసీల్దార్ వెంకటలక్ష్మి, ఎంపీడీఓ గీతావాణి, ఎస్ఐ చంద్ర, ఏఎస్ఐ మోహన్‌కృష్ణ, పెద్దతుంబళం హెడ్‌కానిస్టేబుల్ గోపాల్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ విజయలక్ష్మి జాలిమంచి గ్రామానికి వెళ్లి వివాహాన్ని అడ్డుకున్నారు. ఓ దశలో తల్లిదండ్రులు, గ్రామస్తులు అధికారులపై తిరగబడ్డారు. బాల్యవివాహం చేయడం నేరమని తల్లిదండ్రులకు నచ్చజెప్పినప్పటికీ తమకు గిట్టనివారు ఇలా చేశారని తల్లిదండ్రులు వాపోయారు.

కోలుకోలేక వ్యక్తి మృతి

కర్నూలు : కర్నూలు శివారులోని ఎఫ్‌సీఐ కాలనీలో కొత్తగా కడుతున్న జిలానీ బాషా ఇంటికి వాచ్‌మెన్‌గా పనిచేస్తున్న ఉయ్యాలవాడ నాగరాజు (33) ప్రమాదానికి గురై ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కోలుకోలేక మృతిచెందాడు. ఈనెల 20వ తేదీ రాత్రి మృతుడు నాగరాజు మద్యం సేవించి కొత్తగా తెచ్చిన గ్రిల్‌కు రెడ్‌యాక్సైడ్ కొడుతుండగా అది మీద పడింది. దానిని కార్బన్ లైన్ ఆయిల్‌తో కడుక్కున్నాడు. ఆ తర్వాత సిగరెట్ అంటించుకోవడానికి అగ్గిపుల్ల వెలిగించుకోగా అతని బట్టలకు మంటలు వ్యాపించి కేకలు వేస్తుండగా తల్లి అక్కమ్మతో పాటు మరికొంతమంది కలిసి నీళ్లు చల్లి మంటలను అదుపు చేశారు. తీవ్రంగా బొబ్బలు రావడంతో కాలిన గాయాలకు ఆసుపత్రిలో చికిత్స చేయించగా కోలుకోలేక మంగళవారం రాత్రి మృతిచెందాడు. ఇతనికి వివాహం కాలేదు. తల్లి అక్కమ్మ ఫిర్యాదు మేరకు మూడవ పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

డీటీఎఫ్ నూతన కార్యవర్గం ఎన్నిక

కర్నూలు సిటీ: డెమొక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ (డీటీఎఫ్)జిల్లా నూతన కార్యవర్గాన్ని బుధవారం జరిగిన 16వ జిల్లా కౌన్సిల్ సమావేశంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బీక్యాంపులోని ప్రభుత్వ ఉన్నత (బాలుర)పాఠశాలలో జరిగిన సమావేశంలో జిల్లా గౌరవ అధ్యక్షుడిగా వీరన్న, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా కరె కృష్ణ, గట్టు తిమ్మప్ప ఎన్నికైయ్యారు. వీరితో పాటు ఉపాధ్యక్షులుగా కె.ఎస్ మరోరంజని, వి.జి వెంకటరాముడు, ఇ.నాగరాజుగౌడ్, పాటిల్ ఈశ్వర్ రెడ్డి, కార్యదర్శులుగా బి.రామన్న, జి.భీమన్న, ఇమ్మానియేలు, కె.వెంకటేశప్ప, కె.వి. గంగాధర్, ఆడిట్ కమిటీ సభ్యులుగా వై.చంద్రశేఖర్, బి.సోమశేఖర్, హనుమంతు, రాష్ట్ర కౌన్సిలర్లుగా గోట్ల చంద్రశేఖర్, బీఎండీ మజాహర్ బాషా, వై.చంద్రశేఖర్ యాదవ్, మద్దయ్య, శివకుమార్, కె.బాజరప్ప, తాజుద్దీన్, గీతను ఎన్నుకున్నారు. అనంతరం నూతన కమిటీ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ ఉపాధ్యాయులకు రెగ్యులర్ పదోన్నతులు ఇవ్వాలని, పోస్టులను బ్లాక్ చేయకూడదన్నారు. బదిలీల జీఓ అసంబద్ధంగా ఉందని, వెంటనే ఉన్నతాధికారులు స్పందించి జీఓలో సవరణలు చేయాలన్నారు. సమావేశంలో సంఘం రాష్ట్ర కార్యదర్శి గోట్ల చంద్రశేఖర్, ఉపాధ్యాయ క్రాంతి పత్రిక ప్రధాన సంపాదకులు రత్నం ఏసేపు, తదితరులు పాల్గొన్నారు.

'ఆదర్శం'.. విద్యార్థుల భవితకు ఆహ్వానం

- ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తులు ప్రారంభం
- మెరిట్ ఆధారంగా విద్యార్థుల ఎంపిక
- పిల్లల నైపుణ్యాభివృద్ధికి ప్రత్యేక శిక్షణ



ఏపీ మోడల్ స్కూల్

ఓర్వకల్లు: గ్రామీణ విద్యార్థుల భవిష్యత్‌కు బంగారు బాటలు వేసే దిశగా ఏపీ ఆదర్శ పాఠశాల ఇంటర్ ప్రవేశాలకు ఆహ్వానం పలుకుతోంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చొరవతో ఆదర్శ కళాశాలలను కార్పొరేట్, ప్రైవేట్ కళాశాలలకు దీటుగా అన్ని హంగులతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. ప్రతిభా వంతులైన నిరుపేద విద్యార్థులకు పూర్తిస్థాయిలో ఆంగ్ల మాధ్యమంలో విద్యాబోధన అందిస్తున్న ఓర్వకల్లు ఆదర్శ పాఠశాల నిరుపేద పిల్లల భవితకు చక్కని అవకాశం కల్పిస్తోంది. ప్రైవేట్ విద్యా సంస్థల్లో వేలకు వేలు ఫీజు చెల్లించే ఆర్థిక స్థోమత లేని పేద కుటుంబాల పిల్లలకు ఉచితంగా నాణ్యమైన విద్యా ప్రమాణాలు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం నాడు–నేడు పథకం ద్వారా అత్యాధునిక సదుపాయాలతో పాఠశాల రూపురేఖలు మార్చేసింది.

ప్రవేశాలకు దరఖాస్తులు

మోడల్ స్కూల్‌లో 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభమైంది. ఇంటర్ మొదటి సంవత్సరం బైపీసీ/ఎంపీసీ/ఎంఈసీ/సీఈసీ గ్రూపులలో ప్రవేశం కోరు విద్యార్థులు తమ దరఖాస్తులను ఈ నెల 22 నుంచి జూన్ 7 వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. ప్రభుత్వ/ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో 10 వ తరగతి ఉత్తీర్ణులైన వారు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలి.

ప్రవేశ రుసుం

కళాశాలలో చేరదలచిన ఓసీ, బీసీ, మైనార్టీ విద్యార్థులు రూ.200, ఎస్సీ, ఎస్టీలు రూ.150 చొప్పున ప్రవేశ రుసుం చెల్లించాలి. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులను 10వ తరగతిలో వచ్చిన మార్కుల మెరిట్ ఆధారంగానే ఎంపిక చేయడం జరుగుతుందని స్కూల్ ప్రిన్సిపాల్ జోషిలవాట్ తెలిపారు.

సాక్షి సినిమాలు

ఎస్‌వీసీ కాంప్లెక్స్ : బిచ్చగాడు 2, అన్నీ మంచి శకునములే, ఫాస్ట్ ఎక్స్, విరుపాక్ష , ది కేరళ స్టోరీ, పొన్నియిన్ సెల్వన్–2, గార్డియన్స్ ఆఫ్ గెలాక్సీ–3,
వీ మెగా ఆనంద్ సినీ కాంప్లెక్ష్ : కస్టడీ, ఫాస్ట్ ఎక్స్, బిచ్చగాడు 2, ఉగ్రం, విరుపాక్ష, సింహాద్రి
వెంకటేష్ సినీ కాంప్లెక్స్ : బిచ్చగాడు 2, అన్నీ మంచి శకునములే, విరుపాక్ష
ఐనాక్స్ : ఫాస్ట్ ఎక్స్, ది కేరళ స్టోరీ, ఉగ్రం, హసీనా, గార్డియన్స్ ఆఫ్ గెలాక్సీ–3
భరత్ కాంప్లెక్స్ : ది కేరళ స్టోరీ, విరుపాక్ష
శ్రీరామ : సింహాద్రి
రాజ్ : ఫాస్ట్ ఎక్స్
విజయ : బిచ్చగాడు 2